ఘనంగా బాలినేని వివాహ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-పామూరు : ప్రకాశం జిల్లా సీనియర్ వైకాపా నాయకులు, మాజీ మంత్రి, ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసులు రెడ్డి, సచిదేవి దంపతుల 39వ వివాహ దినోత్సవ వేడుకలు హైదరాబాదులోని బాలినేని నివాసంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని బాలినేని శ్రీనివాసులు రెడ్డి, సచిదేవి దంపతుల చేత కేకును కట్ చేయించారు. బాలినేని దంపతులకు దారపనేని వివాహ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి చిన్ని శ్రీకృష్ణుని ప్రతిమను బహూకరించారు. వీరిద్దరి వైవాహిక జీవితము ఆనందంగా, అహ ల్లాదంగా కొనసాగాలని భవిష్యత్తులో ఇటువంటి వివాహ దినోత్సవ వేడుకలు ఇంకా ఎన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని దారపనేని చంద్రశేఖర్ తెలిపారు.

విశాలాంధ్ర
ప్రకాశం జిల్లా

కనిగిరి డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన చింతలచెరువు

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి సబ్ డివిజన్ డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రత్నాకరం రామరాజును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా చింతలచెరువు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కనిగిరి డివిజన్ పరిధిలో ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలను అందించాలని ఆయన కోరారు. డీఎస్పీ రత్నాకరం రామరాజు ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు పోలీసు వ్యవస్థ నిరంతరం పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మూలె గోపాల్ రెడ్డి, లింగారెడ్డి, అంజిరెడ్డి, శివారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, చైతన్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకులను వెంటనే విడుదల చేయాలి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : అకాల వర్షానికి నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర రైతు సంఘం, కౌలు రైతుల సంఘం పిలుపు మేరకు సీయం కార్యాలయాన్ని ముట్టడికి వెళ్ళకుండా ముందస్తు అక్రమ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దేవుండ్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం అరెస్టు చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్, కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్యలను వెంటనే విడుదల చేయాలని యర్రగొండపాలెం తహాశీల్దార్ కె.దాసుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వరి, మొక్కజొన్న తదితర పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు, వాణిజ్య పంటలైన మిర్చి, పొగాకు, పత్తి తదితర పంటలకు ఎకరాకు రూ.75000, ఉద్యాన బత్తాయి, నిమ్మ తదితర పంటలకు ఎకరాకు లక్ష రూపాయలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. తడిసి, రంగు మారిన ధాన్యాన్ని పసుపు, మొక్కజొన్న, జొన్న, శనగ తదితర పంటలను కొనుగోలు నిబంధనలు సడలించి మద్దతు ధరల ప్రకారం కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల రాష్ట్రంలో ఐదు నుండి ఆరు లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయన్నారు. రైతాంగం నష్టపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో పంటలు కొనుగోలు చేయనందున తీవ్రంగా నష్టపోయారన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి కృష్ణ గౌడ్, సీపీఐ నాయకులు నక్కా తిరుపతయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : వ్యవసాయ రైతులు అందరూ ఈ కేవైసీలో తమ వేలు ముద్రలు వేయాలని వ్యవసాయ శాఖ దర్శి ఏడిఏ నిర్మలాదేవి అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ సమావేశం వ్యవసాయ శాఖ అధికారిని ఎస్ మేరమ్మ అధ్యక్షతన జరిగినది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వ్యవసాయంలో చేపట్టబోయే వ్యవసాయ పద్ధతుల గురించి సిబ్బందికి వివరించారు. రైతు భరోసా కేంద్రాలలో అర్హులైన రైతుల జాబితాను నోటీసు బోర్డుపై అంటించాలన్నారు. రైతులకు 50 శాతం రాత్రిపై పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు, పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు

సీఐ కే శ్రీనివాసరావు

విశాలాంధ్ర-పామూరు : ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి ఆటోలు నడిపితే కేసులు నమోదు చేస్తామని సిఐ కే శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణంలో ఎక్కడపడితే అక్కడ ఆటోలు ఆపడం, వేగముగా నడపడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన ప్రమాదాలకు దారి తీస్తున్నాయని సిఐ కే శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం దాడులు నిర్వహించి డ్రైవింగ్ లైసెన్స్ లేని ఐదు బ్యాటరీ ఆటోలపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపించడం జరిగిందని సిఐ కే.శ్రీనివాసరావు తెలిపారు.

ప్రైవేటు కార్యక్రమంలో 'అన్నా'

విశాలాంధ్ర-కంభం : కంభం మండలం కందులాపురం గ్రామానికి చెందిన పాపా వారి వివాహ వేడుకలో గిద్దలూరు నియోజకవర్గ శాసన సభ్యుడు అన్నా వెంకట రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూ వరులైన శ్రీ విద్య, చంద్ర శేఖర్ రెడ్డి లను ఎమ్మెల్యే అన్నా ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కో ఆప్షన్ మెంబెర్ సయ్యద్. సలీమ్, మాజిమార్కెట్ యార్డ్ చైర్మన్ నెమలి దిన్నె చెన్నారెడ్డి, మాజీ కో ఆప్షన్ మెంబెర్ సయ్యద్.హుస్సేన్ బాష, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పేదల కోసం జీవితాలను త్యాగం చేసిన మహోన్నతులు కమ్యూనిస్టులే

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య

సమావేశంలో మాట్లాడుతున్న రావుల వెంకయ్య

విశాలాంధ్ర -మద్దిపాడు: కార్మిక, కర్షక, పేద ప్రజల అభ్యున్నతికి తమ జీవితాలను త్యాగం చేసిన మహోన్నతమైన వ్యక్తులు కమ్యూనిస్టులేనని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ రావుల వెంకయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని బుధ గురువారాల రాత్రి భారత కమ్యూనిస్టు పార్టీ పెదకొత్తపల్లి గ్రామ శాఖ, మరెళ్లగుంట పాలెం గ్రామ శాఖ, అంజయ్యనగర్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో కామ్రేడ్ నల్లూరి అంజయ్య కామ్రేడ్ ఎద్దు సుబ్బారావుల వర్ధంతి వేడుకలను సీపీఐ నాయకులు, కార్యకర్తలు వారి అభిమానులు ఘనంగా నిర్వహించడం జరిగింది. ముందుగా సీపీఐ నాయకులు ఆయా గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించడం జరిగింది. బుధవారం రాత్రి మారెళ్ళ గుంట పాలెం గ్రామ శాఖ కార్యదర్శి నల్లూరి రామారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది ముందుగా సభా ప్రాంగణంలో ప్రజానాట్యమండలి కళాకారులచే కోలాట ప్రదర్శనను నిర్వహించారు. అనంతరం గురువారం రాత్రి అంజయ్యనగర్ పార్టీ కార్యాలయం వరకు పిన్నలు పెద్దలు అనే తారతమ్యం లేకుండా సీపీఐ జెండాను భుజాన పట్టి అమరవీరులకు విప్లవ జోహార్లు అర్పిస్తూ తమ గ్రామానికి వచ్చినటువంటి భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులకు ఘనస్వాగతం పలకడం జరిగింది. సమావేశానికి ముందుగా అంజయ్యనగర్ ప్రజానాట్యమండలి కళాకారులచెట కోలాట ప్రదర్శన నిర్వహించడం జరిగింది. సమావేశం నందు ప్రజానాట్యమండలి కళాకారులు అరుణోదయ అంజయ్య కాకిశ్రీనివాసరావు అనంతలక్ష్మిలు విప్లవ గేయాలను సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి అంజయ్యనగర్ గ్రామ శాఖా కార్యదర్శి కామ్రేడ్ అంగలకుర్తి వెంకట్రావు అధ్యక్షత వహించారు. సభకు హాజరైన ఎటువంటి పలువురు సిపిఐ నాయకులు నల్లూరి అంజయ్య, ఏద్దు సుబ్బారావుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అఖిల భారత రైతు సంఘం అధ్యక్షుడు రావుల వెంకయ్య మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో ఏర్పడిన 9 సంవత్సరాలలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను రోజురోజుకు పెంచినది.తద్వారా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య నిరుపేదల బతికే పరిస్థితి లేకుండా పోయిందని మరోపక్క కార్పొరేట్ కొమ్ముకాస్తుందని ఆయన బీజేపీపై మండిపడ్డారు. ఉద్యోగులకు సీపీఎస్ విధానాన్ని వారం రోజుల్లోనే రద్దు చేస్తారంటూ, జీపీఎస్ విధానం ముద్దు అంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులను నిలువునా ముంచేసిందని ఆయన అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మరియు జిల్లా ఇంచార్జ్ కామ్రేడ్ గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ దళితులపై దాడులు, అత్యాచారాలు రౌడీయిజం రోజురోజుకు పెచ్చరిల్లి పోతున్నాయని 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పార్టీకి 25 ఎంపీలను ఇస్తే బీజేపీమెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకువస్తామని చెప్పినటువంటి జగన్మోహన్ రెడ్డి ఈరోజు తనపై ఉన్నటువంటి నేరారోపణలను రద్దుచేయించుకుని క్రమంలో బీజేపీ వద్ద మోకాళ్లపై కూర్చున్న పరిస్థితిని ఆయన రాష్ట్ర ప్రభుత్వం పని తీరును దుయ్యబట్టారు. గత ముప్పై మూడు సంవత్సరాల నుంచి కామ్రేడ్ నల్లూరి అంజయ్య కామ్రేడ్ ఎద్దు సుబ్బారావుల వర్ధంతి వేడుకలను జరపడం చాలా గొప్ప విషయమని భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో అంజయ్యనగర్ స్థిరస్థాయిగా నిలుస్తుందని ఆయన అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నందు సభ్యత్వం ఉండటం ఎంతో అదృష్టంగా భావించాలని, సీపీఐ పార్టీ విధివిధానాలు చరిత్రను నేటి యువతరం తెలుసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందని ప్రస్తుత రాజకీయ పార్టీల్లో సభ్యత్వానికి రుసుం చెల్లిస్తు రోజుకు ఒక పార్టీ నుంచి మరొక పార్టీకి మారే పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. ఇరు వర్ధంతి వేడుక సభల్లో పాల్గొన్నటువంటి అతిథులు కమ్యూనిజం మాసపత్రిక సంపాదకులు ఎంసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కామ్రేడ్ నల్లూరి అంజయ్య కామ్రేడ్ ఎద్దసుబ్బారావులు మన గ్రామాలలోని ప్రజలు హృదయాలలో స్మృతులుగా స్థిరస్థాయిగా నిలిచిపోయినారు. సీపీఐ ఎప్పటికీ ప్రజల పక్షానే ఉంటూ ప్రజల సమస్యలపై ఎప్పుడూ పోరాడుతూనే ఉంటుందన్నారు. జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ వి హనుమారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాలు మతపరమైన దేశ రాజకీయాలకు గా ఉన్నాయన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ నాగరాముడు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అసమానతలను తొలగించాలన్న, ధనిక, పేద అనే తారతమ్యం పోవాలంటే సోషలిజం రావాలి అంటే ఎప్పటికైనా కమ్యూనిస్టు పార్టీలు ద్వారానే సాధ్యపడుతుందని ఆయన అన్నారు. సిపిఐ జిల్లా నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు మాట్లాడుతూ 1950వ దశకంలో మాలపల్లె నేడు అంజయ్యనగర్కు నీటి ఎద్దడి వచ్చింది. ఎవరు కనికరించక పోతే ఆ రోజు నీళ్లుండవు. దళితులు ఎదుర్కొంటున్నట్టు వంటి విపత్కర పరిస్థితులను గమనించిన కామ్రేడ్ నల్లూరి అంజయ్య తన సహచర బృందం వాళ్లను ఆదుకోవటానికి నడుం బిగించారు. ఆ క్రమంలో దళితవాడలో మకాం పెట్టి అంతా కలిసికట్టుగా ఉండి చెరువులో నీళ్లు ముంచుకోవలని చెప్పారు. దీనితో దళితులతో పాటు తాగునీటి చెరువు వద్దకు వెళ్లగా అగ్రవర్ణాల వారు వారిని అడ్డుకోగా అగ్రవర్ణాలవారికి దళితులకు జరిగినట్టు వంటి ఘర్షణలో ఒకరికి తల పగిలిన దళితులు వెనుకడుగు వేయకుండా ఆనాటి కమ్యూనిస్టు పార్టీ నాయకుల అండతో చెరువులో నీరు ముంచారు. ఈ ఘటన పెదకొత్తపల్లి పంచాయతీ పరిసర గ్రామాల్లో తీవ్ర సంచలనం కలిగించింది. దళితుల పక్షాన గ్రామస్తుల అయినటువంటి కమ్యూనిస్టు పార్టీ నాయకులు పొత్తూరి పేరయ్య, మన్నం పిచ్చయ్య, మండవ వీరయ్య, ఎద్దు సుబ్బారావు కాకి బుచ్చయ్య దళితుల పక్షాన నిలబడ్డారు. ఆనాటి గ్రామ సమస్యలపై భారత కమ్యూనిస్టు పార్టీ పోరాటాలను చేసినటువంటి సేవా కార్యక్రమాలను వివరించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో కామ్రేడ్ అంగలకుర్తి వెంకటరావు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మారెడ్డి సిపిఐ జిల్లా సమితి నాయకులు మద్దులూరి అంజయ్య ప్రముఖ వైద్యులు ఎయిమ్స్ యజమాని డాక్టర్ రామలింగేశ్వరరావు ఎద్దు సుబ్బారావు కుమారుడు ఎద్దు అజయ్ కుమార్ కామ్రేడ్ నల్లూరి అంజయ్య కామ్రేడ్ ఎద్దు సుబ్బారావులతొ ఉన్నటువంటి పార్టీ పరమైన ఎటువంటి సంబంధాలు మరియు వారు భారత కమ్యూనిస్టు పార్టీ తరుపున చేసిన ఉద్యమాలు ధర్నాలు సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం కామ్రేడ్ పొత్తూరి పేరయ్య సుబ్బమ్మ అను దంపతులు అంజయ్య నగర్ కు చెందిన దుగ్గిరాల శ్రీనివాసరావు చదువుకునేందుకు గతంలో ఆర్థిక సహాయాన్ని అందజేసి చదివిచ్చారని వారి కుటుంబానికి కృతజ్ఞతా భావంతో తాను కూడా పేద విద్యార్థులకు సహాయం అందించాలనే సదుద్దేశంతో దుగ్గిరాల శ్రీనివాసరావు కామ్రేడ్ పొత్తూరి పేరయ్య సుబ్బమ్మ మరియు దుగ్గిరాల బాలయ్య జ్ఞాపకార్థంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది. దీనితో పాటుగా భవిష్యత్తులో పోటీ పరీక్షలకు శిక్షణ ఖర్చులను పూర్తిగా తానే భరిస్తానని సభాపూర్వకంగా దుగ్గిరాల శ్రీనివాసరావు హామీ ఇవ్వడం జరిగింది అందజేయడం జరిగింది. జిల్లా ఒంగోలు నగరానికి చెందిన చందు డ్యాన్స్ అకాడమీ బాలబాలికల దేశభక్తి, జానపద నాట్యాలను నిర్వహించారు. మార్లగుంట పాలెం గ్రామశాఖ కార్యదర్శిగా నల్లూరి రామారావు, సహాయ కార్యదర్శిగా నల్లమోతు హనుమంతరావు, అంజయ్య నగర్ గ్రామ శాఖ సహాయ కార్యదర్శులుగా బొమ్మల గోపీనాథ్, ఈసా సీతారామయ్య, పెద కొత్తపల్లి గ్రామ కార్యదర్శి నల్లజర్ల శ్రీనివాసరావు నాతాని కోటిలింగం, సీపీఐ నాయకులు గోగినేని వెంకటేశ్వరరావు (రావు) మద్దులూరి అంజయ్య, ప్రజానాట్య మండలి గాయకులు పావులూరి అంజయ్య, ఈసా రామ కోటయ్య, పంచాయతీ వార్డు నెంబర్ మీనా, మాధవి పాల్గొన్నారు.

పేదరికం చదువుకు అడ్డు కాకూడదు

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : పేదరికం చదువుకు అడ్డు రాకూడదని రెడ్డి సంక్షేమ సేవా సంఘం నియోజకవర్గ కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక రెడ్డి సంక్షేమ సేవా సంఘం కార్యాలయంలో అథ్లెటిక్స్‌లో విజయం సాధించిన ఒంటేరు వాణికి ఆర్థిక సహాయం అందించారు. గుంటక సుబ్బారెడ్డి మాట్లాడుతూ రెడ్డి సంక్షేమ సంఘాన్ని 2018లో స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలతో దూసుకువెళ్తూ, టాలెంట్ ఉండి కూడా ఆర్థికంగా చదువుకోలేని పేద విద్యార్థులకు మేమున్నాము అంటూ పేదరికం చదువుకు అడ్డు రాకూడదు అని సంకల్పంతో మరో అడుగు ముందుకువేసి అథ్లెటిక్స్‌లో 400 మీటర్స్ 1500 మీటర్స్‌లో విజయం సాధించిపై చదువులకు, పిటి ట్రైనింగ్‌కు ఆర్థికంగా వెనకబడిన మార్కాపురం మండలం నాయుడు పల్లి గ్రామానికి చెందిన ఒంటేరు వాణి అను విద్యార్థినికి రెడ్డి సంక్షేమ సేవా సంఘం తరఫున రెడ్డి సంఘం సభ్యులు చిట్టిబాబు (కోచ్) సమక్షంలో ఆర్థిక సహాయం చేయడం జరిగింది. రెడ్డి సంక్షేమ సేవా సంఘం నియోజకవర్గ కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి మాట్లాడుతూ పేదరికంతో ఇబ్బంది పడుతున్న విద్యార్థినీ విద్యార్థులకు తమ వంతు సహాయం చేయటానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం వెన్న వెంకటరెడ్డి, తిరుమలరెడ్డి రామిరెడ్డి, కుందూరు రమణారెడ్డి, చిట్టిరెడ్డి నరసింహారెడ్డి, గుంటక భాస్కర్‌రెడ్డి, కందుల బలరామిరెడ్డి, కుందూరు మల్లారెడ్డి, గోరంట్ల చిన్న వెంకటరెడ్డి, ప్రకాష్, రెడ్డి సంఘం సోదరులు పాల్గొన్నారు.

నేడు రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ

వైసీపీ మండల అధ్యక్షుడు గంగసాని

విశాలాంధ్ర-పామూరు : రాష్ట్ర వ్యాప్తంగా వైయస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లను రైతులకు అందించే కార్యక్రమంలో భాగముగా శనివారం ఉదయం 9 గంటలకు మండలం లోని బొట్లగూడూరు రైతు భరోసా కేంద్రం పంపిణీ చేయడం జరుగుతుందని వైసీపీ మండల అధ్యక్షులు గంగాసాని హుస్సేన్‌రెడ్డి తెలిపారు. తదుపరి మోపాడు కొండారెడ్డి పల్లి,యల్ యన్ పురం, పామూరు - 2 సచివాలయల పరిధిలో పనిముట్లు రైతులకు అందించడం జరుగును. కావున పార్టీ నేతలంతా ఉదయం 9 గంటలకు బొట్లగూడూరు లోని ఆర్బీకే వద్ద హాజరు కావాలని హుసేన్‌రెడ్డి కోరుతున్నారు.

రైతు భరోసా పథకం అర్హుల జాబితా ప్రదర్శన

విశాలాంధ్ర-తాళ్లూరు : 2023-24 ఆర్థిక సంవత్సరంలో రైతు భరోసా పథకం అర్హుల జాబితాను రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించబడుతుందని మండల వ్యవసాయ అధికారి బి.ప్రసాదరావు అన్నారు. మండల కేంద్రమైన తాళ్లూరులోని రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతు భరోసా పథకం నూతన అర్హుల జాబితా ప్రదర్శనగా ఉంచారు. వ్యవసాయాధికారి ప్రసాదరావు మాట్లాడుతూ ఈ నూతన ఆర్థిక సంవత్సరంలో రైతు భరోసా పథకం అర్హుల జాబితాను ప్రతి గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శనగా ఉంచారని, రైతులు వాటిని పరిశీలించి తమ పేర్లు ఉన్నాయో లేవో గమనించాలని ఆయన తెలిపారు.

డీఎస్పీ అశోక వర్ధన్ రెడ్డిని కలిసిన వైసీపీ నేతలు

విశాలాంధ్ర-తాళ్లూరు : దర్శి నూతన డిఎస్పీగా ఇటీవల విధుల్లో చేరిన అశోక వర్ధన్‌రెడ్డిని శుక్రవారం తాళ్లూరు మండల వైసీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన రాష్ట్ర వైసీపీ సంయుక్త కార్యదర్శి ఐవి సుబ్బారెడ్డి, ప్రకాశం జిల్లా సర్పంచుల సంఘ ఉపాధ్యక్షులు తాళ్లూరు మండల సర్పంచ్ల సంఘ అధ్యక్షులు మారం ఇంద్రసేనారెడ్డి, దోసకాయలపాడు సర్పంచ్ కోట శివలక్ష్మి వెంకటరామిరెడ్డి, తదితరులు డిఎస్పి అశోక వర్ధన్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతూ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. రాజంపల్లి మాజీ సర్పంచ్ కోటేశ్వరరావు, పులిపాడు సుబ్బారెడ్డి, కైపు అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు ఇంటి నివేశన స్థలాలు ఇవ్వాలి

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన పేదలందరికీ ఇంటి నివేశిత స్థలాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై రవీంద్రబాబు, కనిగిరి నియోజకవర్గం కార్యదర్శి సయ్యద్ యాసిన్ అన్నారు. శుక్రవారం స్థానిక దర్శి చెంచయ్య భవన్లో అర్హత ఉండి ఇళ్లస్థలాలు మంజూరు కానీ లబ్ధిదారులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ జగనన్న ఇంటి నివేశిత స్థలాలు పేరుతో సెంటు భూమిని పేదలకు ఇవ్వడం జరిగిందని,ఆ సెంటు స్థలంలో సరిపోక ఇంటిని నిర్మించుకోలేని పరిస్థితిలో లబ్దిదారులు ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ గడువు ప్రకారం జగనన్న కాలనీలో ఇళ్లను నిర్మించుకోలేని లబ్దిదారుల ఇంటి స్థలాలను తిరిగి వెనక్కి తీసుకోవడంపై భారత కమ్యూనిస్టు పార్టీగా తీవ్రంగా ఖండించారు. అర్హులైన పేదలకు ఇంటి నివేశ స్థలాలు ఇచ్చి ప్రభుత్వమే ఇంటి నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసి ఇస్తామని చెప్పినటువంటి ప్రభుత్వం, ప్రస్తుతం పేదల స్థలాలను కుంటి సాకులతో మరల వెనక్కి తీసుకోవడం పట్టాలు రద్దు చేస్తానని చెప్పడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అర్థం పడుతుందని వారు అన్నారు. అర్హులైన పేదలందరికీ మూడు సెంట్లు ప్రభుత్వ భూమిని పేదలకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో పేదల ఇంటిని నివేశ స్థలాల పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని అన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు లేక ఇల్లు నిర్మించుకోలేక అనేకమంది అద్దెలు చెల్లించుకుంటూ ఇరుకు గదులలో జీవనము సాగిస్తున్నారని అర్హులైన వారికి మూడు సెంట్లు ఇంటి నివేష్టాలను ఇచ్చే ప్రభుత్వమే ఇంటి నిర్మాణాన్ని పూర్తిచేసే పేదలకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జి పి రామారావు, అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి పుట్టా సుబ్బారావు, సిపిఐ నాయకులు జయంపు కోటయ్య, అంకమ్మ, కొమరగిరి శ్రీను, నాగలక్ష్మి, వెంగమ్మ, ఏడుకొండలు, కొండయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాలు తనిఖీ

విశాలాంధ్ర-పిసిపల్లి : మండలంలోని తలకొండపాడు ముద్దపాడు రైతు భరోసా కేంద్రాలను శుక్రవారం మండల ప్రత్యేక అధికారి ఎస్ శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీ చేసి సందర్శించారు. ముందుగా రైతు భరోసా కేంద్రాల యందు రైతు భరోసా లబ్ధిదారుల జాబితాలను ప్రదర్శించి ఈ నెల 15వ తేదీలోపు తప్పొప్పులు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. అనంతరం ముద్దపాడు రైతు భరోసా కేంద్ర పరిధిలోని వైయస్సార్ యంత్ర సేవ పథకం కింద రూ 7 లక్షల 50 వేల రూపాయల సబ్సిడీపై పొందిన యంత్రాలను వ్యవసాయ పనిముట్లను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఈ వెంకటరమణ వ్యవసాయ అధికారి జి వెంకటస్వామి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు సిబ్బంది కన్వీనర్ బొర్రారెడ్డి సర్పంచులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-వెలిగండ్ల : జిల్లా కలెక్టర్, పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ 2023లో భాగంగా శుక్రవారం వెలిగండ్ల మండలంలో సెలెక్ట్ చేసిన మండల లెవెల్ పీర్ వెరిఫికేషన్ టీం సభ్యులు టీంలీడర్ :పంచాయతీ కార్యదర్శి షేక్.షకీలా, టీంమెంబర్ : గుడిపాటి పల్లి సర్పంచ్ కటికల రిబ్కా ,వెంకటరత్నం, టీమ్ మెంబర్ యస్ హైజి (డ్వాక్రా) గోన సోనియా పందువ గ్రామపంచాయతీ, జాల్లపాలెం గ్రామపంచాయతీల నందు ఉన్న మౌలిక సదుపాయాలు యస్ డేబ్లు ఎం, యస్ డేబ్లు పి సి షెడ్లు పరిశీలించారు. గ్రామ ప్రజలతో టీం మెంబర్ గుడిపాడు పల్లి సర్పంచ్ కటికల రిబ్కా వెంకటరత్నం మాట్లా డుతూ ప్రజలందరూ తమ గ్రామాల, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత వారిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో టి.శ్రీనివాసులు, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

జీ తెలుగులో సరిగమప గ్రాండ్ ఫినాలే ప్రసారం

విశాలాంధ్ర - ఒంగోలు:

జీ తెలుగు పాపులర్ నాన్ ఫిక్షన్ షో సరిగమప గ్రాండ్ ఫినాలే మే 14వ తేదీ ఆదివారం జరగనుందని ఆ ఛానల్ ప్రాంతీయ ప్రతినిధి వెల్లడించారు. ఈ సంగీత ప్రయాణంలో 14వ సీజన్‌గా ప్రారంభ మైన సరిగమప ఛాంపియన్ షిప్ తుది పోరుకు సిద్ధమైందన్నారు. ఈ ఆదివారం, మే 14న ప్రసారం కానున్న సరిగమప ఛాంపియన్‌షిప్ గ్రాండ్ ఫినాలేలో విజేతలెవరో తేలిపోనుందనీ, ఛాంపి యన్స్ మధ్య జరుగుతున్న ఈ పోరులో టైటిల్ విన్నర్ ఎవరో తెలుసుకోవాలంటే ఈ ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రసారం కానున్న సరిగమప ఛాంపియన్‌షిప్ గ్రాండ్ ఫినాలే ఎపిసోడ్‌ని జీ తెలుగు ఛానల్లో తప్పకుండా చూడాలని కోరారు. జనవరి నుంచీ ప్రతి వారం తమ ప్రదర్శనలతో అలరిస్తున్న సరిగమప కంటెస్టెంట్స్ ఈ వారం మరిన్ని అద్భుత ప్రదర్శనలతో ప్రేక్షకులను మెప్పించేందుకు సిద్ధమయ్యారన్నారు. తుదిపోరులో తలపడేందుకు సిద్ధమైన కంటెస్టెంట్స్, మెంటర్స్ ఎంట్రీతో ప్రారంభమయ్యే ఈ వారం ఎపిసోడ్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుందనీ, ముఖ్య అతిథిగా ప్రముఖ సంగీతల దర్శకుడు మణిశర్మ హాజరవు తారన్నారు. ఎనర్జిటిక్ యాంకర్‌గా ప్రదీప్ వ్యవహరిస్తారని, హీరో అల్లరి నరేష్ పాల్గొంటారని చెప్పారు.

దాతలు..మా కుటుంబాన్ని ఆదుకోండి

విశాలాంధ్ర-తాళ్లూరు : హాయిగా సాగిపోయే ఓ కుటుంబం సమస్యల వలయంలో చుట్టుకుంది. చూడడానికి భార్యాభర్త ఇద్దరు పిల్లల పరిమిత కుటుంబంగా ఉన్నప్పటికీ కొండంత కష్టం ఆ కుటుంబాన్ని వేధిస్తుంది. ఇలాంటి దుస్థితి మండలంలోని మాధవరం గ్రామంలో కొడిమెల వెంకట్రావు కుటుంబం అనుభవిస్తుంది. కొడిమెల వెంకట్రావు, సుశీల దంపతులకు ఆదిత్య కుమార్, రవి ప్రకాష్ ఇద్దరు మగసంతానం. కళకళలాడుతూ సాగిపోతున్న వెంకట్రావు కుటుంబ జీవితంలోకి ఎస్ఎంఎ అనే నూతన వ్యాధి ద్వారా కొండంత కష్టాలు దుఃఖ సాగరంలో ముంచేశాయి. చిన్న కుమారుడు రవి ప్రకాష్ మూడు సంవత్సరాల వయసులో కండరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహింపచేశారు. వ్యాధి తగ్గకపోగా అది అంతకంతకు ఎక్కువ కావడంతో హైదరాబాదులోని ప్రత్యేక వైద్యశాలలో వైద్య పరీక్షలు నిర్వహించగా ఎస్ఎంఎ-3 అనే వ్యాధి సోకినట్లు దీనికి అతి ఖరీదైన వైద్యం ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. తమ వద్ద ఆర్థిక స్తోమత లేక ఫిజియోథెరపీ చేయిస్తూ కాలం వెలదీస్తున్నారు. ఇదిలా ఉండగా 17 సంవత్సరాల వరకు ఆరోగ్యంగా ఉండి చదువుకుంటున్న పెద్ద కుమారుడు ఆదిత్య కుమార్‌కు కూడా ఇలాంటి వ్యాధి లక్షణాలు బయటపడటంతో ఆ కుటుంబం ఖంగు తిన్నది. వైద్య పరీక్షల నిమిత్తం పంపగా ఎస్ఎంఎ వ్యాధి వల్ల శరీర అవయవాలు పనిచేయక ఆగిపోతాయని భారతదేశంలో దీనికి వైద్యం లేదని ఇతర దేశాల నుండి కోట్లాది రూపాయల ఖర్చుతో వ్యాక్సిన్ ఉపయోగిస్తే ప్రయోజనం ఉంటుందని తెలపగా ఆ కుటుంబం తీవ్ర మనోవేదనకు గురవుతుంది. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి తమ కుమారుల వైద్య ఖర్చులకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించిన తమ కుటుంబాన్ని, ముక్కు పచ్చలారని ఇద్దరు బిడ్డల ప్రాణాలను రక్షించాలని ఆ కుటుంబం వేడుకుంటుంది. అయ్యా మా కుమారులు ఎస్ఎంఏ వ్యాధితో బాధపడుతున్నారు. దీనివల్ల వారి అవయవాలు భవిష్యత్తులో పనిచేయక ఆగిపోయి చివరికి ఏ స్థితికి వెళుతుందో తెలియదు. దయవుంచి సహాయ సహకారాలు అందించి మా పిల్లల ప్రాణాలు రక్షించాలని కొడిమెల వెంకట్రావు కోరుతున్నారు.

వివాహ వేడుకల్లో టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామపంచాయతీ నందు ఉన్న వెంగపల్లి గ్రామంలో శుక్రవారం టీడీపీ నాయకుడు కూదలి ఆదినారాయణ కుమారుడు వివాహానికి ముఖ్య అతిథులుగా టీడీపీ మాజీ మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జ్ గాయం తిరుపతిరెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గంగిరెడ్డి రమేష్‌రెడ్డి, గాయం కృష్ణారెడ్డి, కూదలి దశరథ, కూదలి రోశయ్య పాల్గొన్నారు.

బాలినేని దంపతులకు వివాహ దినోత్సవ శుభాకాంక్షలు

విశాలాంధ్ర-కొమరోలు : రాష్ట్ర వైసిపి నాయకులు, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులురెడ్డి శచీ దేవి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ నాయకులు కామూరి రమణారెడ్డి శుక్రవారం హైదరాబాదులోని బాలినేని నివాసానికి వెళ్లారు. బాలినేని దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెస్తవారిపేట ఎంపీపీ ఓసూరారెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు అక్కి పుల్లారెడ్డి, రామ్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

జీవో 1 రద్దు హర్షణీయం

విశాలాంధ్ర-కనిగిరి : ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలిగించేలా వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఒకటిని హైకోర్టు రద్దు చేయడంపై శుక్రవారం సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై రవీంద్రబాబు, కనిగిరి నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ యాసీన్, కనిగిరి మండల సిపిఐ కార్యదర్శి జిపి రామారావు శుక్రవారం దర్శి చెంచయ్య భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో హర్షం వ్యక్తం చేశారు. సభలు, సమావేశాలు, రాస్తారోకో వంటి కార్యక్రమాలను జరపకూడదని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చీకటి జీవోను తీసుకురావడం సహేతుకం కాదన్నారు. ఈ జీవోపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హైకోర్టులో వేసిన పిటిషన్‌తో జీవోను రద్దు చేయటం చారిత్రాత్మకమన్నారు. కేవలం ప్రతిపక్ష పార్టీల గొంతు నొక్కడమేనని హైకోర్టు భావించి రద్దు చేయటం సంతోషదాయకమన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

- డీపీఓ జీవీ నారాయణరెడ్డి

విశాలాంధ్ర-దొనకొండ: గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి తెలిపారు. వేగంగా నిర్మించేందుకు అవసరమైన ఇసుక, సిమెంట్, ఇనుము సామాగ్రి లబ్ధిదారులకు అందేలా చర్యలు చేపట్టాలని, స్వయం సహాయక సంఘాలు నుండి రుణాలు అందేలా చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ పరిశీలించి, ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్ర పరచి బ్లాక్ బోర్డుపై క్లీనింగ్ తేది నమోదు చేయాలన్నారు. గ్రామంలోని డంపింగ్ యార్డును సందర్శించి నిర్వహణ మెరుగు పరచాలని, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, తాత్కాలిక నీటి సదుపాయం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పీర్ వెరిఫికేషన్‌లో భాగంగా దొనకొండ మండల కమిటీ సభ్యులు నిర్వహిస్తున్న తనిఖీని పరిశీలించి వారికి తగు సూచనలు చేశారు. అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రతి కార్యక్రమంలో పురోగతి వచ్చేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.వసంతరావు నాయక్, డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ హనుమంతరావు, ఈఓఆర్డీ ఎస్.డేవిడ్ ఉన్నారు.

ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు జయప్రదం చేయండి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నూకసాని

విశాలాంధ్ర-ఒంగోలు : బుధవారం మే 17వ తేదీన ఉదయం 10 గంటలకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఒంగోలులోని పాటిబండ్ల గోపాల స్వామి (పి.జి.ఎస్). కన్వెన్షన్‌లో జరిగే తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి, విశ్వవిఖ్యాత నటసార్వభౌములు, పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలను తెదేపా నేతలు, కార్యకర్తలు భారీ ఎత్తున హాజరై విజయవంతం చేయాలని టీడీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు, జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ పిలుపునిచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించి రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను ఒంగోలులో నిర్వహిస్తున్నట్టు నూకసాని తెలిపారు.

చుక్కల భూముల చిక్కులకు పరిష్కారం

కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ :
చుక్కల భూములను 22 (ఎ) నుండి తొలగించడం ద్వారా ప్రజలకు ఎంతో మే జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం చుక్కల భూముల చిక్కులకు శాశ్వత పరిష్కారం" కార్యక్రమాన్ని నెల్లూరు జిల్లా నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలో లబ్దిదారులకు కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో 1(బి) సర్టిఫికెట్లను కల అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 37,615 ఎకరాల చుక్కల భూమి పేరుతో ప్రభుత్వ భూమి క్రింద నిషేధిత జాబితాలో ఉందన్నారు. ఇలాంటి భూములను రిజిస్ట్రేషన్ చేయడం, తాకట్టు పెట్టుకోవడం, వెబ్ల్యాండ్లో పేరు అప్డేట్ చేసుకోవడం వంటి వాటికి అవకాశం లేదన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలైన రైతు భరోసా, పంట నష్టం వంటివి వీటికి వర్తించవన్నారు. 2016 నుంచి దాదాపు ఇప్పటివరకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. 'రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మన జిల్లాలో ఇటువంటి భూములను గుర్తించామన్నారు.

2016కు ముందు 12 సంవత్సరాలు సాగులో ఉండి దాని వివరాలు అడంగల్‌లో కానీ, 1(బి) కానీ, పాత 1(ఎ) లో కానీ, పాతపట్టాలో పేరు నమోదై ఉండి, వారికి ఎక్కడైనా రిజిస్ట్రేషన్ జరిగిఉండి (లేక) 1952 56 వరకు రిజిస్ట్రేషన్ డిపార్ట్ మెంట్లో వాడిన రిజిస్టర్ ఆఫ్ హోల్డింగ్స్ అనే డాక్యుమెంట్ లో ఎక్కడైనా పట్టాదారు పేరు నమోదైఉంటే ప్రయివేట్ పొలం పట్టా పొలాన్ని గుర్తించి ప్రభుత్వ నిషేధిత 22 (ఎ) నుంచి తొలగించి, వీరందరికీ పక్కాగా ప్రయివేట్ పొలంగా గుర్తింపు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రకాశం జిల్లాలోని 38 మండలాలలో రెవిన్యూ రికార్డులలో చుక్కల భూములుగా నమోదు కాబడిన సుమారు 37,615 ఎకరాల భూమిని 'చుక్కల భూమి' రిజిస్ట్రేషన్ చట్టం-1908 లోని సెక్షన్-22(1)(ఇ) నుండి ప్రభుత్వం తొలగించిందన్నారు.

దీని ద్వారా జిల్లాలో సుమారు 25,052 కుటుంబాలకు సుమారు రూ.3 వేల కోట్ల విలువైన లబ్ధి చేకూరిందని కలెక్టర్ అన్నారు. ఈ మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ రోజు నుండి ప్రతి నియోజక వర్గంలో ఉన్న ఎం.ఎల్.ఏ.లు తమ నియోజక వర్గంలో ఈ కార్యక్రమం ద్వారా లబ్ధిపొందిన రైతులకు గౌరవ ముఖ్యమంత్రిగారిచ్చిన 1 (బి) సర్టిఫికేట్లను వారికందజేస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె. శ్రీనివాసులు, డి.ఆర్.ఓ. శ్రీమతి, ఆర్. శ్రీలత అధికారులు పాల్గొన్నారు.

పేదవాడికి సొంతింటి కల నెరవేర్చడమే జగన్ లక్ష్యం

- వరి కూటి అశోక్ బాబు

విశాలాంధ్ర-సింగరాయకొండ : పేదవాడికి సొంత ఇల్లు నెరవేర్చడమే వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని అదే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 30 లక్షల సొంత ఇంటి స్థలాలు అందించారని కొండపి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రతి పేదవారికి ఇల్లు ఉండాలని అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తొలితగా జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా లోనే ఎక్కువ శాతం సింగరాయకొండ మండలంలోని పేదలకు ఇల్లు మంజూరయ్యాయని 3500 పైన ఇళ్ల స్థలాలు కేటాయించారని తెలిపారు ప్రభుత్వం హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ ద్వారా 1,80,000తో పాటు డ్వాక్రా గ్రూపులో ఉన్న సభ్యులందరికీ 35 వేల రూపాయలు పావలా వడ్డీ కే రుణం మంజూరు అవుతుందని గృహం కట్టుకునే విధానాన్ని సులువుగా ఉంటుందని ఇల్లుకట్టుకోకుండా నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వ అధికారులు ఇచ్చిన స్థలాన్ని వెనక్కి తీసుకుంటారని కావాలన్నా వీలు కాదని తెలిపారు ప్రధానంగా ఎక్కువ శాతం మంది బాడుగ నివాసంలో ఉంటున్నారని సొంత హక్కు కల్పించుకోవడానికి జగన్మోహన్ రెడ్డి ఎంతో మంచి లక్ష్యంతో ప్రజల వద్దకే ఇటువంటి పథకాలు తీసుకురావడం ఏ ప్రభుత్వం చేపట్టలేదని తెలిపారు అదే స్థాయిలో లక్ష రూపాయలకే ఇంటి నిర్మాణం ఏర్పాటు చేసేలా కాంట్రాక్టర్లు కూడా మాట్లాడుతున్నామని తక్కువ ఖర్చుతో ఇంటి నిర్మాణం జరిగే విధంగా ఏర్పరచుకోవాలని ప్రతి పేదవాడు స్వగృహంలో ఉండటమే అందరికీ ఆనందంగా ఉంటుందని తెలిపారు. అధికారులు కూడా ప్రతి పేదవాడికి నిత్యం అందుబాటులో ఉంటూ గృహస్తులు చేసేదాకా ప్రభుత్వం పై నుండి ఒత్తిడి ఉంటుందని తెలిపారు. ఎటువంటి సమాచారం కావాలన్నా దగ్గరలో ఉన్న సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ను సంప్రదిస్తే తగు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమీగుల్లా ఎంపీపీ కట్ట శోభరాణి, వైస్ ఎంపీపీ సామంతులు రవికుమార్‌రెడ్డి, సంబంధిత శాఖ అధికారులు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులకు ఆహ్వానం

విశాలాంధ్ర-ఒంగోలు : 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(బాలికలు), ఒంగోలు నందు ఒకటవ విడత ప్రవేశానికి ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్,డ్రాఫ్ట్‌మెన్ సివిల్, సూయింగ్ టెక్నాలజీ (టైలరింగ్) ట్రేడ్‌లలో నూతనంగా 6 నెలల కాల వ్యవధిలో డ్రోన్ సర్వీస్ టెక్నాలజీ కోర్సులు ప్రారంభించినట్లు, అడ్మిషన్లు కొరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(బాలికలు) ప్రిన్సిపల్ పి.ఉమా మహేశ్వరీ దేవి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈనెల 10 నుండి జూన్ 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సర్టిఫికేట్ల వెరిఫికేషన్‌కు జూన్ 7వ తేదీన కలేజీలో ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9603041678, 8977711292ను సంప్రదించాలని కోరారు.

వివాహ వేడుకల్లో ఎంపీటీసీ సుబ్బారెడ్డి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి ఎస్సీ కాలనీ నందు శుక్రవారం గోన సుధాకర్ అరుణ కుమారుడు పవన్ వివాహ వేడుకలలో ముఖ్య అతిథులుగా మండల ఎంపీటీసీ ఉడుముల వెంకట సుబ్బారెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల దళిత నాయకులు కత్తి తిరుపాలు,ఉప సర్పంచ్ కత్తి కిషోర్, బాబు, కోల గురు, లక్ష్మీనారాయణ, చిట్టి, సురేష్, కత్తి అజయ్, ఆనంద్, కత్తి ఎజ్రా పాల్గొన్నారు.

రాజధాని రైతులకు మద్దతుగా పాదయాత్ర

విశాలాంధ్ర - రేపల్లే : రాజధాని రైతులకు మద్దతుగా ఈనెల 13న ఉదయం 9 గంటలకు అమరావతిలోని తుళ్లూరు నుండి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మృతి వనం వరకు మాజీ న్యాయమూర్తి జై భీమ్ భారత్ పార్టీ అధినేత జడా శ్రావణ్ కుమార్ పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాంజీ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలు 32 శాతం మంది రాజధానికి భూములు ఇచ్చినారని నేడు ఆర్ 5 జోన్ ఏర్పాటుతో తమకున్న కొద్దిపాటి భూములను రాజధానికి కేటాయించిన ఆ వర్గాలకు చెందిన సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. ఎస్సీ ఎస్టీ రైతుల పక్షాన సుప్రీంకోర్టులో జడ శ్రావణ్ కుమార్ పిటిషన్ దాఖలు చేసి ఎస్సీ ఎస్టీ రైతుల తరపున వాదనలను వినాలని కోరిన విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. రాజధాని ప్రాంతంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాల రైతులకు న్యాయం జరిగే వరకూ వారికి అండగా జై భీమ్ భారత పార్టీ రాజీ లేని పోరాటాలకు సిద్ధపడుతుందని పేర్కొన్నారు.

జగనన్న లేఔట్లను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర-టంగుటూరు : టంగుటూరు మండలంలోని ఆలకూరపాడు గ్రామము వెళ్లే జగనన్న కాలనీ లేఅవుట్లను శుక్రవారం ప్రకాశం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ పరిశీలించారు. కాలనీవాసులతో మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకు రావాలన్నారు. కాలనీవాసులు ముఖ్యంగా నీటి సమస్య ఉందని సమస్యను పరిశీలించాలని, వాటర్ సమయం పెంచాలని కాలనీవాసులు తెలపగా కలెక్టర్ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు తెలియజేశారు. అంతేకాకుండా కాలనీని త్వరగా పూర్తి చేయాలని, గృహాలు నిర్మించుకునే వారికి వెలుగు ద్వారా అందించే ఆర్థిక సమాయం త్వరగా ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు తీసుకొని బేస్‌మట్టం వరకు కూడా నిర్మించలేనటువంటి వారి పట్టాలు రద్దుచేసి అవసరమైన వారికి ఇస్తామని కనుక త్వరగా బేస్ మట్టాలు వేసుకొని పని మొదలు పెట్టాలన్నారు. అంతేకాకుండా సచివాలయం-2లో రికార్డులు పరిశీలించి సిబ్బంది పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ పరిధిలోని కాలువలు పందులు బెడదను జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఆ సమస్యలు పరిశీలించాలని ఎంపీడీవోకు తెలియజేశారు. మరలా వచ్చేసరికి సమస్యలు లేకుండా చూడాలన్నారు. రికార్డులు మెయింటినెన్స్ సరిగా లేదన్నారు. మహిళ పోలీసు మైనర్లను గుర్తించి వారి కౌన్సిలింగ్ ఇచ్చి బడికి వెళ్ళేలాగా చూడాలన్నారు. మేజర్ పంచాయతీలో డ్రైనేజీ సమస్య ఉందని వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, సర్పంచి మద్దిరాలు మమత సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలి

- బీజేపీ ఒంగోలు నియోజక వర్గ కన్వీనర్ యోగయ్య యాదవ్

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని బిజెపి ఒంగోలు నియోజక వర్గం కన్వీనర్ యోగయ్యయాదవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజా ఛార్జిషీట్ నమోదులో భాగంగా శుక్రవారం ఒంగోలు అసెంబ్లీ పరిధిలోని జక్కరయ్య హాస్పిటల్ వద్ద బిజెపి ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యోగయ్య యాదవ్ ఆధ్వర్యములో ఇంటింటికీ తిరిగి ప్రజలనుండి అర్జీలు స్వీకరించటం జరిగింది. ఈ సందర్భముగా యోగయ్య ప్రజలనుద్దేశించి మాట్లడుతూ. ఒంగోలు నగరంలో ఎటు చూసినా సమస్యలు తాండవిస్తున్నాయని, ఇళ్లు. ఇళ్ళ స్థలాల కోసం. తీసేసిన వృద్ధాప్య పింఛన్లు తిరిగి ఇప్పించాలని. ప్రజల నుండి అధిక సంఖ్యలో అర్జీలు వస్తున్నాయన్నారు. దీన్ని బట్టి ఈ వైఎస్ఆర్సీపీ దుష్ట పాలనకు చరమగీతం పాడకపోతే ప్రజలు ఇంకా నష్టపోతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వము దివాలా అంచున ఉన్న దని,కనీసం ఉద్యోగులకు జీతాలు సకాలములో ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఖజానా లో డబ్బులు లేకుండా, సంక్షేమ పథకాలు పేరుతో జగన్ ఎన్ని బటన్లు నొక్కినా ఉపయోగం ఏముందన్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రజలను దగా చేస్తున్నావని విమర్శించారు. కార్యక్రమంలో 3వ మండల అధ్యక్షులు గుర్రం రంగనాథ్. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సెగ్గం శ్రీనివాసరావు,ఎస్సీ మోర్చ జోనల్ ఇంఛార్జి మోజి, జిల్లా కార్యదర్శి పి కోటేశ్వరి. ఉమాదేవి. అల్లరి రామయ్య. మధు యాదవ్. జిల్లా ప్రధాన కార్యదర్శి శివాజీ యాదవ్.తదితరులు పాల్గొన్నారు.

చీకటి జీవోలు మానుకోవాలి

విశాలాంధ్ర - చీరాల : జిఓ1 పై హైకోర్టు ఇచ్చిన తీర్పుకు చీరాల టీడీపీ పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీను హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 75 మంది సలహాదారులను నియమించుకుని ప్రత్యర్థి పార్టీలు ఎటువంటి సభలు ర్యాలీలు నిర్వహించకుండా అర్ధరాత్రి జిఓ నెంబర్ 1 ను తీసుకువచ్చి ప్రభుత్వంపై ఎవరు ప్రశ్నించకుండా చేశారన్నారు. జిఓను హైకోర్ట్ రద్దు చేయాలని తీర్పు ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాలు నిర్వహించు సభలు సమావేశాలలో తొక్కిసలాటలు జరగటానికి కారణం అన్నారు.

ఉపాధిహామీ కూలీలకు సూచనలు

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ప్రతి శుక్రవారం నిర్వహించే రోజ్ గార్ దివస్, శ్రామిక దినోత్సవం పుల్లలచెరువు మండలం నాయుడుపాలెం పంచాయతీలో టెక్నీకల్ అసిస్టెంట్ గుడిమెట్ల నాగార్జున ఆధ్వర్యంలో పని చేసే ప్రదేశంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధిహామీ కూలీలకు పలు సూచనలు సలహాలు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్‌రెడ్డి ఉన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే అన్నా

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని ఇస్లాంపేటలోని షేక్ హొండా తమ్ముని వివాహ కార్యక్రమానికి గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మండల జడ్పీటీసీ సారె వెంకట నాయుడు, చింతపల్లె మాజీ సర్పంచ్ సారె.జనార్దన్ నాయుడు, కొమరోలు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు వైస్ సర్పంచ్ లు వైస్ ఎంపీపీ షేక్. మౌలాలి,ఎంపీటీసీలు, జాజం.వెంకట రమణ, తిరుపతి రాజు,సుబాన్,మండల వైస్సార్ సిపి నాయకులు వెంకటేశ్వరచౌదరి, అల్లినగరం పంచాయతీ వైస్సార్ సీపీ నాయకులు, బంగారు విశ్వరూపం, గోల్కొండ సుబాన్, వైస్సార్ సిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను ప్రారంభించిన సర్పంచ్

విశాలాంధ్ర-వెలిగండ్ల : వైఎస్ఆర్ కంటి వెలుగు ప్రజలకు వరం అని సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు అన్నారు. శుక్రవారం వెలిగండ్ల సచివాలయంలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనివర్గాల ప్రజలకు సముచితగా పనిచేసేస్తున్నదని కంటి సుపులేకుంటే మనిషి జీవితంలో ముందుకు ఆగలేదు అన్నారు. పేదలకు ఆపరేషన్‌లు ఉచితంగా నిర్వహించి అద్దాలు కూడా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. సిహెచ్ఓ కోటిలింగం, నిర్మల, కుమారి పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే జ్ఞానం

విశాలాంధ్ర - సంతమాగులూరు : సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు 5వ రోజు శుక్రవారం నిర్వహించారు. గ్రంథపాలకుడు బాదం విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉంచారు.

నల్లూరిలో మరింత పటిష్ఠంగా ఎమర్జెన్సీ అండ్ క్రిటికల్ కేర్ విభాగాలు

విశాలాంధ్ర-ఒంగోలు : స్థానిక నల్లూరి నర్సింగ్ హోమ్ నందు ఎమర్జెన్సీ మరియు క్రిటికల్ కేర్ విభాగాలను మరింత పటిష్టం చేస్తున్నామని నల్లూరి నర్సింగ్ హోమ్ సి ఓ ఓ సాతులూరి నరసింహమూర్తి తెలియజేశారు.ఎమర్జెన్సీ మరియు క్రిటికల్ కేర్ విభాగం నందు విశేష అనుభవం కలిగిన డాక్టర్ శ్రీ చరణ్, డాక్టర్ మృదుల, డాక్టర్ మధు వైద్య బృందం ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్ విభాగం నందు తమ పూర్తి కాలం వైద్య సేవలు అందజేస్తారని తెలియజేశారు. ఎమర్జెన్సీ సేవలైన పాము కాటు, తేలుకాటు, పురుగు మందులు తాగిన వారికి, అవయవాల పనితీరు సరిగా లేనివారికి, ఆస్తమా, సిఓపిడి, కిడ్నీ ఫెయిల్యూర్, శ్వాసకోశ వ్యాధులు, ఇన్ఫెక్షన్ మరియు ఐసీయూ ట్రీట్మెంట్ అవసరమైన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తామని నల్లూరి నర్సింగ్ హోమ్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ జనరల్ అండ్ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నల్లూరి నితిన్ తెలియజేశారు. ఎమర్జెన్సీ అండ్ క్రిటికల్ కేర్ విభాగాధిపతి డాక్టర్ శ్రీ చరణ్ గారు మాట్లాడుతూ యశోద హాస్పిటల్స్, రమేష్ హాస్పిటల్ నందు ఇంతకుముందు వైద్య సేవలు అందించి, ఇప్పుడు నల్లూరి నర్సింగ్ హోమ్ నందు తన వైద్య సేవలు అందించడం చాలా సంతోషకరంగా ఉంది అని తెలియజేశారు. ఏటువంటి ఎమర్జెన్సీ అండ్ క్రిటికల్ కేసునైనా నల్లూరి నర్సింగ్ హోమ్ నందు ట్రీట్ చేయబడుతుందని, ప్రకాశం జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాల్సిందిగా తెలియజేశారు. నిర్వహించిన కార్యక్రమంలో జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య రక్షణ కొరకు నల్లూరి నర్సింగ్ హోమ్ వారు హెల్త్ ప్రివిలైజ్డ్ కార్డ్‌ను మీడియా మిత్రులకు అందజేశారు. ఈ కార్డు వలన డిస్కౌంట్ తో కూడిన వైద్య సేవలు పొందవచ్చు అని తెలియజేశారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ బేరి ఆంజనేయులు రెడ్డి, డాక్టర్ మృదుల, డాక్టర్ మధు, నల్లూరి నర్సింగ్ హోమ్ సిఈఓ నల్లూరి నీరజ్, మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం సైదా, సీనియర్ మేనేజర్ శ్రీనివాస్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నాయక్ పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలి

దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి

విశాలాంధ్ర-మార్కాపురం : పట్టణంలోని విజయ థియేటర్ ఏరియాలో (దివ్యాంగుల విభాగం టౌన్ ఉపాధ్యక్షులు) నూతన టి.వి, గ్రైండర్, ఫ్యాన్లు, మిక్సీలు రిపేర్ షాపును వైయస్ఆర్‌సిపి దివ్యాంగుల విభాగం ప్రకాశం జిల్లా అధ్యక్షులు దొంతిరెడ్డి గోపాల్ రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దొంతిరెడ్డి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క దివ్యాంగుడు నిరాశ నిస్పృహలకు లోను కాకుండా ప్రభుత్వం నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాల ద్వారా వృత్తి విద్యా కోర్సులను అభ్యసించి నైపుణ్యాన్ని సంపాదించుకుని స్వయం శక్తితో జీవనోపాధి దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. అందుకు ఉదాహరణగా మన రహమాన్‌ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఆశక్తి కలిగిన దివ్యాంగులు ఎవరైనా ముందుకు వచ్చిన యెడల వాళ్లకు వైయస్ఆర్ సీపి దివ్యాంగుల విభాగం ప్రకాశం జిల్లా తరపున సహాయ సహకారాలు అందించదానికి మేము అన్నివేళలా సిద్ధంగా ఉంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు నడికట్టు రమణారెడ్డి, రూరల్ అధ్యక్షులు లుంజల శేఖర్, టౌన్ కార్యదర్శులు చముదురి సురేంద్ర, విడుదల అశోక్, టౌన్ కోశాధికారి తుంబేటి వెంకటరమణ బ్లయిండ్ అసోసియేషన్ నాయకులు బోయపాటి వెంకటరామయ్య, టౌన్ సీనియర్ నాయకులు గజ్జల హరి ఇతర దివ్యాంగులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణత

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : తర్లుపాడు మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయ కలుజువ్వల పాడులోని సి.బి.ఎస్.ఇ. 12వ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ బి.ఇ.జి ప్రసన్న కుమార్ తెలిపారు. 40మంది విద్యార్థులు పరీక్ష రాయగా 40 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎమ్.సాయి సుధా మాధురి 458/500 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలువగా, ఎ.వి.సి.ఎ.అరవింద్ గౌడ్ 457/500 టి.హరికృష్ణ 446/500లతో ద్వితీయ, తృతీయ, స్థానాలను పొందారు. 433/500 మార్కులతో బి.లక్ష్మీనరసింహ నాల్గవ స్థానం పొందగా, 428/500 మార్కులతో డి.అఖిల 5వ స్థానాన్ని, 427/500 మార్కులతో బి.సతీష్ కుమార్ 6వ స్థానాన్ని పొందినట్లు ప్రిన్సిపాల్ బి.ఇ.జి.ప్రసన్న కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల కృషిని ప్రశంసించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

'రమేష్ సంఘమిత్ర'లో ఘనంగా నర్సింగ్‌డే

విశాలాంధ్ర-ఒంగోలు : అంతర్జాతీయ నర్సింగ్ డే ఉత్సవాలను స్థానిక రమేష్ సంఘమిత్ర హాస్పిటల్‌లో శుక్రవారం ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను స్మరించుకుంటూ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్రిగేడియర్ పీజీ ఉషాదేవి హాజరై జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఫ్లోరెన్స్ నైటింగేల్ ప్లెడ్జ్‌ను సిఐఎస్ ప్రసన్నకుమార్ నర్సింగ్ సిబ్బంది చేత ప్రమాణం చేయించారు. ఈసందర్భంగా వృత్తిలో నైపుణ్యం చూపిన సిబ్బందికి బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా హాస్పిటల్ మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి అన్ని వృత్తులలో కన్నా గొప్పదన్నారు. ఈ వృత్తిలో తల్లిసంరక్షణ, సోదరి ప్రేమ మిళితమైవుంటాయన్నారు. నర్సింగ్ అనేది సైన్స్‌తో కూడిన కళ అన్నారు. హాస్పిటల్ సిఒఒ డాక్టర్ హరికుమార్‌రెడ్డి మాట్లాడుతూ నర్సింగ్ అనేది బాధ్యత కూడిన వృత్తి అన్నారు. ఆరోగ్య కరమైన సమాజ నిర్మాణంలో కీలకపాత్ర అని తెలిపారు. డాక్టర్, రోగి, చికిత్సకు మధ్య నర్సులు అనుసంధాన కర్తలు అన్నారు. అనంతరం సిబ్బంది కేక్ కట్ చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.